# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 2-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:260 పేజీలు:6 వెల: రూ.1/-



## సీఎం రేవంత్ ను కలిసిన ఏవీ రంగనాథ్..

హైదరాబాద్, జులై 1 :సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ ఏవీ రంగనాథ్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స);హైదరాబాద్ లో భారీగా గంజాయి పట్టుబడింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర కు చెందిన అబూబకర్ కాశమ్ సింగ్.. ఏపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు..రూ.4 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

# ప్రతి గూడానికి రహదారి సౌకర్యం.. మంత్రి సీతక్క..

### -ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువం..



ఆదిలాబాద్, జులై 1 :రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని, ప్రతి గిరిజన గూడేనికి రోడ్లు, వంతెన, రవాణా సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని రామలింగంపల్లి గ్రామం నుండి శ్యామ్ నాయక్ తాండ వరకు రూ .3 కోట్ల 75 లక్షల వ్యయంతో చేపట్టిన తారు రోడ్డు, వాగుపై నిర్మించిన వంతెనను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజార్షి షాతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఏజెన్సీ పరిధిలోని ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని, ప్రతి గూడేనికి రహదారి సౌకర్యం కల్పించి వారి సమస్యలు తీరుస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి సీతక్క ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి కోటి రూపాయల వ్యయంతో స్మారకవనానికి భూమిపూజ చేశారు. ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మంత్రివర్గ విస్తరణ.. సీతక్కకు హోంమంత్రి ఇచ్చే అవకాశం : మంత్రి దామోదర

హైదరాబాద్, జులై 1 :ు త్వరలోనే తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆయన సోమవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురి మంత్రుల శాఖలు సైతం మారే అవకాశాలున్నాయన్నారు. సీతక్కకు హోంమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందన్నారు. రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్, నిజామాబాద్ నుంచి ఒకరికి మంత్రివర్గంలో స్థానం లభించే అవకాశం ఉందన్నారు. రాజకీయాలు పరిస్థితులను బట్టి మారుతుంటాయన్నారు. 2018 ఎన్నిలకు ముందు ప్యారాషూట్లకు టికెట్లు లేవని రాహుల్ గాంధీ చెప్పారని.. కానీ పరిస్థితుల దృష్ట్యా టికెట్ల కేటాయింపు జరిగిందన్నారు. త్వరలో వైద్యశాఖలో ప్రక్షాళన, సంస్కరణలు తీసుకువస్తామన్నారు. వైద్యశాఖలో రెండే విభాగాలు ఉండాలన్నారు. ఇందులో ఒకటి అడ్మినిస్ట్రేషన్, రెండు ఎడ్యుకేషన్ అన్నారు.

# కేబినెట్ విస్తరణ నేపథ్యంలో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స);: కేబినెట్ ను విస్తరించొచ్చు నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ను సోమవారం కలుసుకున్నారు. రాజ్ భవన్ లో ఆయనని కలుసుకున్నారు. రానున్న కొన్ని రోజుల్లో కేబినెట్ విస్తరణ ఉండనున్నదన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ముఖ్యమంత్రి గత వారం ఢిల్లీకి వెళ్లి అక్కడ కాంగ్రెస్ ప్రధాన నాయకులతో కేబినెట్ విస్తరణ గురించి చర్చించారని తెలిసింది. ఐదు నుంచి ఆరుగురు మంత్రులను కేబినెట్ లోకి తీసుకోవడం ఖరారయిందని తెలుస్తోంది.

మంత్రి పదవులు వస్తాయని చాలా మంది గత ఆరు మాసాలుగా ఎదురుచూస్తున్నారు. రేవంత్ రెడ్డి, ఆయన 11 మంది కేబినెట్ కొలీగులు 2023 డిసెంబర్ 7న ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్రానికి గరిష్ఠంగా 18 మంది మంత్రులు ఉండొచ్చు. ఇదిలావుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నఅసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బిల్లుల గురించి గవర్నర్ కు వివరించారని



తెలుస్తోంది. చర్చల సందర్భంగా నామినేటెడ్ ఎంఎల్‌సిల అంశం కూడా చర్చకు వచ్చిందని తెలుస్తోంది. గత మార్చిలో తెలంగాణ హైకోర్టు గవర్నర్ కోటా కింద నామినేట్ అయిన ఎం.కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ నామినేషన్లను కొట్టేసింది. గవర్నర్ ఉత్తర్వును 2023 సెప్టెంబర్ 19న హైకోర్టు కొట్టేసింది. బిఆర్ఎస్ నాయకులు శ్రవన్ దాసోజు, కె. సత్యనారాయణ నామినేషన్లను తిరస్కరించింది.

ఆ తర్వాత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, గవర్నర్ కోటా కింద వారి నామినేషన్లను తిరస్కరించారు. గవర్నర్ ఉత్తర్వులను సవాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులు హైకోర్టులో రిట్ పిటీషన్లను దాఖలు చేశారు.

గవర్నర్ ఎంఎల్ సిలను నియమించేలా వారు అప్పీలు చేసుకున్నారు.

# బెంగళూరులో ఈ సీజనులో తొలి డెంగ్యూ మరణం

బెంగళూరు జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కర్నాటక రాజధాని బెంగళూరులో ఈ సీజను తొలి డెంగ్యూ మరణం నమోదయింది. 27 ఏళ్ల యువకుడు డెంగ్యూ కారణంగా చనిపోయాడు. 213 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయాన్ని బృహత్ బెంగళూరు మహానగర పాలిక(బిబిఎంపి) తన హెల్త్ బులెటిన్ లో సోమవారం పేర్కొంది.డెంగ్యూ తో మరణించడం ఈ ఏడాది ఇదే మొదటిది. కాగా హస్సన్, శివమొగ్గ, ధార్వాడ్, హవేరీ సహా ఇతర జిల్లాల్లో ఐదు డెంగ్యూ మరణాలు నమోదయ్యాయి. కాగా కర్నాటక రాజధాని బెంగళూరులో ఓ యువకుడు, 80 ఏళ్ల వృద్ధురాలు డెంగ్యూ కారణంగా చనిపోయినట్లు బృహత్ బెంగళూరు మహానగర పాలిక శుక్రవారం గ్రహించింది. అయితే తర్వాత ఆ వృద్ధురాలు కేన్సర్ కారణంగా మరణించినట్లు స్పష్టీకరించింది. ఇకపోతే డెంగ్యూ వ్యాధితో చనిపోయిన యువకుడు బెంగళూరు శివారులో ఉన్న కగ్గదాసపురా కు చెందిన వ్యక్తి అని నిర్ధారణ అయింది. బెంగళూరు హెల్త్ ఆడిట్ ప్రకారం బెంగళూరు నగరంలో 213 కొత్త డెంగ్యూ కేసులు కనుగొన్నారు.

# దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల నిరసన



న్యూఢిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం దుర్వినియోగం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో మకర దవారానికి దారితీసే మెట్లపైన నిలబడి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతోపాటు కాంగ్రెస్, టిఎంసి, ఆప్‌తోసహా ఇండియా కూటమి ఎంపీలు నిరసన తెలిపారు.ప్రతిపక్షం నోరు మూయించడానికి దర్యాప్తు సంస్థల దుర్వినియోగాన్ని నిలిపివేయాలి, బిజెపిలో చేరి అవినీతికి లైసెన్సు తెచుకోండి అన్న నినాదాలు గల ప్లకార్డులను వారు ప్రదర్శించారు. జైలులో నిలబడి ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఫోటోలతో కూడిన పోస్టర్లను ఆప్ ఎంపీలు కొందరు ప్రదర్శించారు.ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను జులై 12 వరకు జుడిషియల్ కస్టడీకి అప్పగిస్తూ స్థానిక కోర్టు జూన్ 29న ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో ప్రతిపక్ష ఎంపీలు ఈ నిరసన చేయడం గమనార్హం. మనీ లాండరింగ్ కేసులో ఇడి అరెస్టు చేయడంతో బిర్సా ముండా జైలులో ఉన్న జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో గత శుక్రవారం విడుదలయ్యారు.

# వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొట్టుకున్న కారు-ట్రక్కు.. తొమ్మిది మంది దుర్మరణం

న్యూఢిల్లీ, జులై 1 :కారు-ట్రక్కు ఢీకొన్న ఘటనలో తొమ్మిది దుర్మరణం చెందారు. ఇదే ఘటనలో మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో రాజస్థాన్‌లోని కరౌలీలో చోటు చేసుకున్నది. కరౌలీ-మందరాయల్ రహదారిపై దుండాపూరా మలుపునకు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. అతివేగంగా వెళ్తున్న కారు, ట్రక్కు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది.

రెండు వాహనాలు భారీ శబ్దంతో ఢీకొట్టుకోవడం విని స్థానికులంతా అక్కడికి చేరుకున్నారు. ప్రమాదంపై పోలీసులతో పాటు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కరౌలీ జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను పరిశీలించిన వైద్యులు అప్పటికే తొమ్మిది మంది మరణించినట్లు ధ్రువీకరించారు. గాయపడ్డ నలుగురికి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై కలెక్టర్ నీలభ్ సక్సేనా, ఎస్పీ బ్రిజేష్ జ్యోతి ఉపాధ్యాయ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

# నీట్ యుజి సవరించిన ర్యాంకుల జాబితా విడుదల

న్యూఢిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైద్య ప్రవేశ పరీక్ష నీట్ యుజికి చెందిన సవరించిన ర్యాంకుల జాబితాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) సోమవారం ప్రకటించింది. మే 5వ తేదీన జరిగిన నీట్ యుజి పరీక్షకు సంబంధించి ఆరు పరీక్షా కేంద్రాలలో పరీక్ష ఆల్యంగా ప్రారంభం కావడంతో సమయాన్ని కోల్పోయిన అభ్యర్థులకు పరిహారంగా కొన్ని గ్రేస్ మార్కులను కలిపిన ఎన్‌టిఎ తరువాత వాటిని రద్దు చేసింది. ఆ అభ్యర్థులకు తిరిగి పరీక్ష నిర్వహించిన అనంతరం సవరించిన ర్యాంకుల జాబితాను ఎన్‌టిఎ ప్రటించినట్లు అధికారులు సోమవారం తెలిపారు.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూన్ 23న ఏడు కేంద్రాలలో మరోసారి పరీక్షను ఎన్‌టిఎ నిర్వహించింది. మొత్తం 1,563 మంది అభ్యర్థులలో కేవలం 48 శాతం మంది మాత్రమే రెండోసారి పరీక్షకు హాజరయ్యారు. 1,563 మంది అభ్యర్థులలో 813 మంది పరీక్షకు హాజరయ్యారని, మిగిలిన అభ్యర్థులు గ్రేస్ మార్కులు లేకుండా తమకు మొదట వచ్చిన ర్యాంకులనే కోరుకున్నారని అధికారులు తెలిపారు.

## కొత్త క్రిమినల్ చట్టం - నేడు హైదరాబాద్ లో తొలి కేసు నమోదు

హైదరాబాద్, జులై 1 :కొత్త క్రిమినల్ చట్టాల ప్రకారం తెలంగాణలో తొలి కేసు నమోదయింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా కొత్త నేర, న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయి. ఈ కొత్త చట్టం కింద మధ్యప్రదేశ్‌లో అర్ధరాత్రి 12.20 గంటలకు తొలి కేసు నమోదు కాగా? తెలంగాణ రాష్ట్రంలో చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసు నమోదయింది. నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్త చట్టాల ప్రకారం సెక్షన్ 281 బీఎన్ఎస్, ఎంవీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్‌ను డిజిటల్‌గా నమోదు చేశారు.

దేశంలో బ్రిటిష్ పాలన నుంచి కొనసాగుతున్న ఐపీసీ, సీఆర్పీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)కు గత 17వ లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ చట్టాలు జులై 1 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్ ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ వంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి ప్రవేశించాయి.

# మై వేములవాడ ట్రస్ట్‌కు రూ.50,001 విరాళం



రాజన్న సిరిసిల్ల, జులై 1నేటినిజం ప్రతినిధి): : మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ కు రామడుగు వారి కుటుంబ సభ్యులు సోమవారం 50,001 రూపాయలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రామడుగు శ్రీలత, రామడుగు శరత్ చంద్ర- ప్రజ్ఞ దంపతులు, రామడుగు సాయిచంద్ర- శిరీష దంపతులు, రామడుగు రవిచంద్ర- శర్వాణీ దంపతులు కీ.శే.రామడుగు బాలప్రసాద్ దశమ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం ట్రస్ట్ ద్వారా నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి శాశ్వత అన్నదాతగా అట్టి విరాళాన్ని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా గత కోవిడ్ సమయం నుంచి ప్రతిరోజు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమాలు అభినందనీయమని, ట్రస్టుకు మా నాన్నగారైన రామడుగు బాలప్రసాద్ పేరున మావంతు సహకారం అందించాలనే సదుద్దేశంతో విరాళం అందించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ట్రస్టు ద్వారా నిర్వహించే సేవ, అన్నదాన కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు. ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ శాశ్వత అన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందించిన రామడుగు వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించటం జరిగిందని, ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, రామడుగు వారి కుటుంబ సభ్యులు, మీడియా మిత్రులు ఓడ్యాల వేణు, రాపెల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి కందం- నేటికీ అందం

తెలుపగ తమ కృరత్వము
కలకత్తా లోననున్న కాపురుష తతుల్
ఖలులై సంతోషించిరి
పలువురు ఖండించ బోసుబాబు యరెస్టున్
(2-7-1940 కలకత్తాలో బోసు బాబు అరెస్టు)



-రాధశ్రీ
సెల్:9494481210

# అట్టహాసంగా డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే ఉత్సవాలు



కరీంనగర్, జులై 1 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని ఆల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్లో సోమవారం డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి.

ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో డాక్టర్లు, ఛార్టెడ్ అకౌంటెంట్ చాలా గొప్పగా వ్యవహరిస్తారని, వారు చేసే కృషి సమాజ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వైద్యులు, సిఏలు చాలా కీలకంగా వ్యవహరిస్తారని, దేశాభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తారని చెప్పారు. 1991 నుండి వైద్యుల దినోత్సవాన్ని ఐయంఏ వారు నిర్వహిస్తున్నారని, సిఏల దినోత్సవాన్ని ఐసిఏఐ వారు నిర్వహిస్తూ వారి సేవలను గుర్తిస్తూ జాతీయ స్థాయిలో సన్మానం చేస్తారని తెలిపారు. వారు చేసే సేవలు చాలా ఆదర్శనీయమైనవని ప్రత్యేకంగా కోవిడ్-19 సమయంలో వారు పోషించిన పాత్ర చాలా చారిత్రాత్మకమైనదని, ప్రశంసనీయమైనదని చెప్పారు. వైద్యులు ఎటువంటి విరామం లేకుండా ప్రజల జీవితాలను కాపాడుతూ వారి జీవితాల్లో గొప్పగా ఉంటున్నారని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రదానమంత్రి చేతులమీదుగా అత్యుత్తమ వైద్యులకు ఘనసత్కారం ఉంటుందని చెప్పారు. వారు చేస్తున్న కృషికి, దృడసంకల్పాన్ని నేడు పాఠశాలలో ఆత్మీయ సన్మాన వేడుకల్లో వివిధ విభాగాల వైద్యులకు నిర్వహించడం జరిగిందని అన్నారు. వారి వలన ఎన్నో జీవితాలు కాపాడబడ్డాయని చెప్పారు. అందుకే వారిని ఫ్రంట్‌లైన్ వారియర్స్ పిలువబడ్డారని చెప్పారు. అదే విధంగా సిఏల పాత్ర చాలా విశిష్టమైనదని వారి వలన దేశపురోభివృద్ధిచెందుతున్నదని తెలుపుతూ వారు తెలుపబడిన నియమాల వలన పలు ఆర్థిక సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ఏమైనప్పటికి సమాజంలో వారు చాలా కీలకంగా వ్యవహరిస్తూ అబురపరుస్తున్నారని తెలిపారు. డాక్టర్లు, సిఏల గొప్పదనాన్ని వర్ణిస్తు విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు మరియు నాటికలు ఆలోచింపచేసాయి.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వివిధ విభాగాల వైదులు, సి.ఎ.లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# 'ఫ్లైయింగ్ డిస్క్'ల ఉనికికి ఖచ్చితమైన ఆధారాలున్నారా?!

## (02 జూలై 'ప్రపంచ గుర్తించబడని ఎగిరే వస్తువుల దినం' సందర్భంగా)

అనేక సైన్స్ సంబంధ కాల్పనిక కథలు, సినిమాలు, నవలలు, టీవీ సీరియల్స్‌ను మనం బహు ఉత్సుకతతో చూస్తూనే ఉన్నాం. అంతరిక్షంలో మానవుడితో సంబంధం లేని గ్రహాంతర వాసులకు చెందిన 'ఫ్లైయింగ్ సాసర్స్ లేదా డిస్క్'లను చూశామని చెప్పుకునే వ్యక్తుల గూర్చి మనం విన్నాం, చదివాం. ఇలాంటి 'గుర్తించబడని ఎగిరే వస్తువులు లేదా అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్, యుయఫ్‌ఓ' ఉనికి, ఆధారాల, ఆకారాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా 02 జూలై రోజున 'వరల్డ్ అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్ (యుయఫ్‌ఓ) డే'గా నిర్వహించుట జరుగుతుంది. భూమికి, మానవాళికి తెలియని గ్రహాంతర వాసులు ప్రయోగించిన అంతరిక్ష నౌకల ఉనికి గూర్చిన చర్చలు పలు మార్లు వింటున్నాం, చర్చించుకుంటున్నాం. యుయఫ్‌ఓల గూర్చి నిర్వివాదమైన సాక్ష్యాలు ఉన్నాయని ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా జరగాల్సి ఉంది.

గ్రహాంతరవాసుల ప్రయోగాలేనా..!

అమెరికాలో 24 జూన్ 1947న 'కెన్నెత్ ఆర్నాల్డ్' ఏయిర్ క్రాఫ్ట్‌లో గగన వీధుల్లో తిరుగుతున్నపుడు తొలిసారి 'యుయఫ్‌ఓ'లను చూశానని తెలియజేయడం జరిగింది. 1977 వరకు ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్ల జనులు యుయఫ్‌ఓలను చూసి ఉన్నారని కెన్నెత్ తెలియజేశారు. న్యూ మెక్సికో సమీపాన 02 జూలై 1947న 'రూజ్వెల్ యుయఫ్‌ఓ ఫ్లైయింగ్ డిస్క్ క్రాష్' జరిగిందని చరిత్ర చెబుతున్నది. ఇలాంటి ఫ్లైయింగ్ డిస్క్‌లను గ్రహాంతర వాసులు ప్రయోగించి ఉండవచ్చునే భావనను ప్రచారం చేసే వారు కూడా ఉన్నారు.

యూఎఫ్‌ఓల పట్ల అవగాహన:

ఏప్రిల్ 2020లో అమెరికన్ రక్షణశాఖ విడుదల చేసిన మానవ నిర్మితం కాని, భూమి ప్రమేయం లేని అంతరిక్షంలో ఎగిరే వస్తువుల గూర్చిన వీడియోల్లో కొన్ని ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. ఇలాంటి ఉత్సుకతను రేకెత్తించే ఫ్లైయింగ్ సాసర్స్ పట్ల పూర్తి అవగాహన కల్పించే ఉద్దేశంతో "ప్రపంచ యుయఫ్‌ఓ దినం" జరుపుకుంటూ సమావేశాలు, టెలిస్కోప్‌తో అంతరిక్ష దర్శనం, సైన్స్ ఫిక్షన్ సినిమాలు, డాక్యుమెంటరీలు చూడడం, చర్చించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. గ్రహాంతర యుయఫ్‌ఓల గూర్చిన చర్చలు వ్యోమగాముల దృష్టిని ఆకర్షించుట కూడా జరుగుతున్నది. ఇతర గ్రహాల్లో నివసిస్తున్న గ్రహాంతర వాసులు యూఎఫ్‌ఓలను ప్రయోగించి ఉండవచ్చని కొందరు శాస్త్రజ్ఞులు కూడా అభిప్రాయ పడుతున్నారు. యుయఫ్‌ఓల ఉనికిని ఖచ్చితమైన ఆధారాలతో రుజువు చేసిన వారు ఇప్పటికీ లేక పోవడం ఆశ్చర్యకరమే. అవి ఉన్నాయనేది ఒక భావన మాత్రమే అనే వారు కూడా ఉన్నారు. "ఏలియన్", "ఈటి", "మెన్ ఇన్ బ్లాక్", "ది థింగ్" లాంటి సినిమాలను చూస్తే యుయఫ్‌ఓల గుర్చిన కొంత సమాచారం దొరుకుతుంది.

ఇలాంటి గ్రహాంతర ఎగిరే వస్తువులు లేదా ఫ్లైయింగ్ సాసర్స్ పట్ల ప్రజల్లో సాధికార అవగాహన కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలు, శాస్త్రజ్ఞులు, మేధావుల మీదనే ఉందని గుర్తుంచుకోవాలి. ఈ డిజిటల్ ఏఐ శాస్త్రసాంకేతిక యుగంలో యుయఫ్‌ఓల ఉనికి రుజువు కావాలని, గుడ్డిగా నమ్మడం అనర్థదాయకమని కూడా తెలుసుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్యాయత్నం..



ఖమ్మం, జులై 1 : భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు యత్నించాడు. ఫోన్ లొకేషన్ ద్వారా గుర్తించిన పోలీసులు.. చికిత్స కోసం మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆదివారం ఉదయం 8:30 గంటలకు మఫ్టీలో స్టేషన్‌కు వచ్చారు. సోమవారం నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు చేశారు. అదే సమయంలో ప్రైవేట్ కారు రావడంతో డ్రైవర్‌ను దింపిన ఎస్సై.. ఇప్పుడే వస్తానంటూ కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయారు. మధ్యాహ్నం తరువాత సిబ్బంది ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో వెంటనే సీఐ జితే ందర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే ఎస్సై ఫోన్ లోకేషన్‌ను ట్రాక్ చేయగా మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత మండలంలోని తిరుమలకుంట అటవీ ప్రాంతంలో స్విచ్ఛాఫ్ అయినట్టు గుర్తించారు. కానీ రాత్రి 10:45 గంటల వరకు ఆచూకీ లభ్యం లభించలేదు.

ఇంతలో మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్టు గుర్తించారు. వెంటనే ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కేసీఆర్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. నేడు కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెలువరించింది. విద్యుత్ కొనుగోలు అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ విచారణను కేసీఆర్ సవాల్ చేశారు. ఇరువైపుల వాదనలూ విన్న న్యాయస్థానం ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కేసీఆర్ పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు రోజుల ముందే వాదనలు ముగిశాయి. అయితే ఆ రోజున హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అసలు కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది.

ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ సంఘాన్ని నియమించింది.

కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని ఇవాళ హైకోర్టు కొట్టివేసింది.

# ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికే సంక్షేమ పథకాలు

## –పెనుమాక పింఛన్ల పంపిణి లో సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స);: సంక్షేమం అనేది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు తొలి అడుగు పడిందన్నారు. మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పింఛన్లను సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్థులు, లబ్ధిదారులతో చంద్రబాబు ముచ్చటించారు. కొత్త ప్రభుత్వంలో తొలుత పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ అనే వారని గుర్తు చేశారు. ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆంధ్ర ప్రజల ఆశీస్సులతోనే నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశానని చెప్పారు. దివ్యాంగు లకు ఆరు వేల రూపాయల పింఛన్లు పెంచా మని, వారికి చేయూతనివ్వడం సామాజిక బాధ్యత అని బాబు తెలిపారు. పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు ఆర్థిక అసమానతలు లేని సమాజం చూడాలన్నదే తన కోరిక అని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి శక్తి వస్తే ప్రజలకు మరింత తిరిగి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని, మాది ప్రజా ప్రభుత్వం అని, నిరంతరం ప్రజలకోసమే పని చేస్తానని, ప్రజలు నిండు మనస్సు ఆశీర్వదించి తమ ప్రభుత్వానికి సహకరించాలని బాబు విజ్ఞప్తి చేశారు.

# దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు

## – న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ చిరు వ్యాపారిపై మొదటి ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్;): బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలుకుతూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎన్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎన్) చట్టాలను తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొత్త చట్టాల కింద తొలి కేసు నమోదయింది. అదికూడా దేశ రాజధానిలోనే కావడం గమనార్హం. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ చిరు వ్యాపారిపై గత అర్ధరాత్రి ఎఫ్ఐఆర్ నమోదయింది. పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా.. ఆ వ్యాపారి రోడ్డు మీద గుట్కా, వాటర్ బాటిల్స్ అమ్ముతూ వారికి కనిపించాడు. దీంతో దుకాణం రోడ్డుగా అడ్డంగా ఉన్నదని, దానిని తీసేయాలని ఆ వ్యాపారికి చెప్పారు. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ అతను వినకపోవడంతో భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 285 ప్రకారం.. కమలా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదుచేసినట్లు పోలీఉలు తెలిపారు. నిందితుడిని బీహార్‌లోని పాట్నాకు చెందిన పంకజ్ కుమార్‌గా గుర్తించారు. ఈ సెక్షన్ ప్రకారం.. రోడ్లను ఆక్రమించడం, తద్వారా ప్రమాదాలకు కారణం కావడం లాంటి చర్యలు నేరంగా పరిగణించి జరిమానా విధిస్తారు. జరిమానా రూ.5 వేల వరకు ఉంటుంది.

# చందా దేవో.. దందా ఖరో మోడీ సర్కార్ నినాదంగా మారింది

## –ఎఐసిసి ప్రెసిడెంట్, ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే చురకలు

న్యూ ఢిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స: ప్రధాని నరేంద్ర మోడీ ఒకప్పుడు పొత్తులను అపహాస్యం చేశారని, ఇప్పుడు అదే పొత్తులపైనే ఆధారపడ్డారని ఎఐసిసి ప్రెసిడెంట్, ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే చురకలంటించారు. రాజ్యసభలో ప్రెసిడెంట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఖర్గే మాట్లాడారు. మోడీ సినిమాలో అన్నీ లీకేజీలే ఉన్నాయని, నీట్ యూజీ లీక్ చేశారని, నీట్ పిజి రద్దు చేశారని, అయోధ్య రామాలయం పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అయ్యిందని దుయ్యబట్టారు. ఏటా 20 లక్షల ఉద్యోగాల మాట హామీ ఏమైందని, మోడీ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు చెప్పడంతో పాటు కుల, మత, భాషా పరంగా ప్రజలను రెచ్చగొట్టారని ధ్వజమెత్తారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు 200కు పైగా ప్రసంగాలు ఇచ్చారని, మోడీ 117 ఎన్నికల ప్రచార సభలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కానీ ఇసి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు విపక్షాల అకౌంట్లు ఫ్రీజ్ చేశారని, విపక్షాల ప్రచారాన్ని ఎన్నో రకాలుగా అడ్డుకున్నారని, విపక్షాలను అణగదొక్కడం మోడీకి అలవాటుగా మారిందని ఖర్గే మండిపడ్డారు. చందా దేవో? దందా ఖరో మోడీ సర్కార్ నినాదంగా మారిందని, ఇడి, సిబిఐ, ఐటిని ఇష్టం వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వాలు పడగొట్టడం నేతలను కొనడం కామన్‌గా మారిందని, ప్రభుత్వాలను పడగొట్టడం ప్రజాస్వామ్యానికి అవమానం కాదా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలను పడగొట్టారని, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని, కేజ్రీవాల్‌కు ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసులో అరెస్ట్ చేశారని, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు.

# ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన భారతదేశ సుసంపన్న సంస్కృతి.. వారసత్వాలకు

# "యుగయుగీన భారత్ మ్యూజియం' ఓ ప్రతీకగా నిలుస్తుంది: కేంద్ర మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్

న్యూఢిల్లీ, జులై 1 : సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా 'నార్త్–సౌత్ భవన సముదాయాల్లో నిర్మిస్తున్న "యుగయుగీన భారత్ మ్యూజియం"పై కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ 'భారత మండపం'లో 4రోజుల మేధామథన సదస్సు నిర్వహించింది. ఇందులో భాగంగా 2024 జూన్ 26 నుంచి 29వ తేదీ వరకూ వివిధ మంత్రిత్వశాఖల పరిధిలోని భాగస్వామ్య సంస్థలతో సంప్రదింపులు సహా సామర్థ్య వికాస కార్యశాలను కూడా నిర్వహించారు. ఇవాళ చివరి రోజు చర్చకు కేంద్ర సాంస్కృతిక–పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థీరీ మాథౌ వంటి ప్రముఖులు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సాగిన సంప్రదింపుల ప్రక్రియ కింద 'యుగయుగీన భారత్ (ది టైమ్‌లెస్ అండ్ ఎటర్నల్ ఇండియా) మ్యూజియం'పై చర్చకు ప్రదర్శనశాల పర్యావరణ వ్యవస్థకు చెందిన వ్యక్తులతోపాటు ప్రభుత్వ ప్రతినిధులను కూడా భాగస్వాములను చేశారు. అలాగే సామర్థ్య వికాస కార్యశాలకు ఈ అంతర్జాతీయ మ్యూజియం సంప్రదింపుల సంస్థ అయిన 'ఫ్రాన్స్ మ్యూజియమ్స్' నిపుణుల బృందం నేతృత్వం వహించింది.

సామర్థ్య వికాస కార్యశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సాంస్కృతిక–పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ– "ఈ మ్యూజియం భారత సుసంపన్న వారసత్వం, దాని అప్రతిహత ప్రగతి స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుంది. గతంలో బ్లూప్రింట్. ఈ మ్యూజియం సాంప్రదాయ ప్రదర్శన శాలల అనుభవానికి అతీతమైన సార్వజనీన స్ఫూర్తికి ప్రతీకగా ఉంటుంది. ఇదొక ప్రజా ప్రదర్శన శాలగా, సామాజిక కథనాలకు కేంద్రంగా– ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన భారతదేశ వారసత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది" అన్నారు.

న్యూఢిల్లీలోని రైసినా హిల్ సమీపాన భారత కేంద్ర పరిపాలన ప్రదేశం పునరుద్ధరణకు ఉద్దేశించిన సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా నార్త్–సౌత్ బ్లాక్‌లో ఈ కొత్త భారత జాతీయ ప్రదర్శనశాల నిర్మితమవుతోంది. మొత్తం 1,54,000 చదరపు మీటర్లలో విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రదర్శనశాల ప్రపంచంలోనే అతిపెద్దదిగా రికార్డులకు ఎక్కనుంది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని 'గ్లామ్' (గ్యాలరీలు, లైబ్రరీలు, ఆర్కైవ్స్, మ్యూజియంలు) విభాగం 18.05.2023న నిర్వహించిన తొలి అంతర్జాతీయ మ్యూజియం ఎక్స్ పో ప్రారంభోత్సవంలో దీని సందర్శన వీడియోను ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ మొదట ఆవిష్కరించారు. అనంతరం 2023 జూలైలో 'భారత మండపం' ప్రారంభోత్సవం సందర్భంగా పునఃప్రదర్శించారు.

ఈ ప్రదర్శనశాల ఫ్రాన్స్ సహకారంతో 'సానుకూల పునర్వినియోగ' విధానంలో రూపొందుతోంది. ప్రాచీన కట్టడాలను సుందరంగా రూపుదిద్దే ఈ విధానంలో ఫ్రాన్స్ నైపుణ్యానికి అక్కడి లౌవ్రే మ్యూజియం ఒక ఉదాహరణ కాగా, ఆ దేశ ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యాలయం కూడా ఇప్పుడు ఆ భవనంలో ఉండటం గమనార్హం. పైగా రెండు దేశాల మధ్య సుదీర్ఘ స్నేహ సంబంధాలు కూడా ఈ ప్రాజెక్టులో ఫ్రాన్స్ భాగస్వామ్యానికి దోహదం చేశాయి. తదనుగుణంగా ప్రదర్శనశాలలు–సహకారానికి ప్రాధాన్యమిస్తూ 2020లో రెండు ప్రభుత్వాల మధ్య 'ఆసక్తి వ్యక్తీకరణ లేఖ'పై సంతకం చేయడానికి ఈ స్నేహమే తోడ్పడింది.

దీనికి అనుగుణంగా సంక్లిష్ట లక్ష్యాల సాధనను ప్రోత్సహించేలా వరుసగా సామర్థ్య వికాస కార్యశాలల నిర్వహణకు 'గ్లామ్' విభాగం నాయకత్వం వహించింది. ఆ మేరకు భాగస్వాముల మధ్య సమన్వయం, ఏకీకృత దృక్కోణ సృష్టికి తోడ్పడింది. వీటిలో మొదటిదిగా భారత ప్రభుత్వ ఇతర మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఒకే వేదికపైకి తెచ్చిన జూన్ 14న మేధా మథనం నిర్వహించింది. తద్వారా అంతర విభాగ సమన్వయాన్ని పెరగడమేగాక ఈ ప్రాజెక్టు భారతీయ సమాజంలోని వివిధ కోణాలను ప్రతిబింబించేందుకు తోడ్పడుతుంది. అటుపైన తాజాగా జూన్ 26 నుంచి 29 వరకు భారత మండపంలో ప్రభుత్వ ప్రదర్శనశాలల నుంచి ఉన్నతస్థాయి నిర్వహణ సంబంధిత పర్యావరణ వ్యవస్థ భాగస్వాములు సహా పరిరక్షణ వాస్తుశిల్పులు, దృశ్యీకరణ నిపుణులు, ఎగ్జిబిషన్ డిజైనర్లు, ప్రచురణకర్తలు, పరిరక్షకులు, విద్యావేత్తలు వంటి ప్రైవేట్ నిపుణులతో నాలుగు రోజులపాటు మేధామథన సదస్సు కొనసాగింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా కొన్ని రోజులపాటు సాగిన ముమ్మర మేధామథన సదస్సు, కార్యశాలలు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనశాల ప్రధాన కార్యాచరణకు సంబంధించి అమూల్యమైన దృక్కోణాలను ఆవిష్కరిం చాయి. అంతేకాకుండా సేకరించిన కళాఖండాల నిర్వహణ, సంరక్షక విధానాలు, ఉత్తమ పాలన పద్ధతులు, సాంకేతికతల వ్యూహాత్మక ఏకీకరణ వంటి సంక్లిష్ట అంశాలపై ఈ సదస్సులు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ మేధామథనం, కార్యశాలల ద్వారా సమకూరిన విజ్ఞాన సారాంశం యుగయుగీన భారత్ మ్యూజియం ప్రగతికి ఎంతగానో దోహదం చేస్తుంది.

# ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

## –ఏడో తేది వరకూ రిజిస్ట్రేషన్స్ నాలుగో తేది నుంచి సర్టిఫికెట్స్ పరిశీలన

## –19వ తేది నుంచి క్లాసులు ప్రారంభం

అమరావతి, జూన్ 29 : ఏపీలో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నేటి నుంచి 7వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

జులై 4 నుంచి 10 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 8–12 వరకు కోర్సులు, కళాశాలల ఎంపిక కోసం ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. 13న ఆప్షన్ల మార్పు, 16న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 17–22లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. జులై 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఇటీవల కన్వీనర్ నవ్య ప్రకటించారు.

# కర్నాటక సీఎంను మార్చేందుకు కాంగ్రెస్ కసరత్తు

## –పార్టీ హైకమాండ్ నిర్ణయానికి తమంత కట్టుబడి ఉంటాం

## –సీఎం సిద్ధరామయ్య.. సీఎం రేసులో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

న్యూ ఢిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స); కర్నాటక సీఎంను మార్చాలని కాంగ్రెస్ హైకమాండ్ యోచిస్తోందనే వార్తలు గుప్పుమంటున్నాయి. సీఎం రేసులో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేరు వినిపిస్తుండటంతో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. నాయకత్వ మార్పు విషయంపై కర్నాటక కాంగ్రెస్‌లో జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. సిద్ధరామయ్యను పక్కకుపెట్టి డీకే శివకుమార్‌కు పాలనా పగ్గాలు అప్పగిస్తారని హైకమాండ్ సైతం ఈ దిశగా కసరత్తు సాగిస్తున్నదని కాంగ్రెస్ వర్గాల్లో హాట్ డిబేట్ సాగుతోంది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ల సమక్షంలో ఇటీవల ఓ స్వామిజీ డీకేను సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ఇక సీఎం మార్పు వార్తలపై సిద్ధరామయ్యను సోమవారం మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం ప్రజల మధ్య చర్చించాల్సిన వ్యవహారం కాదని పేర్కొన్నారు. పార్టీ హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. సీఎం మార్పు వ్యవహారంపై సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు నాయకత్వ మార్పు ఊహాగానాలు మరింత జోరుగా సాగేలా చేశాయని భావిస్తున్నారు. సీఎంను మార్చుతారనే వ్యాఖ్యలను ఆయన ఖండించకపోవడంపై హాట్‌డిబేట్ సాగుతోంది. దీంతో సీఎం సిద్ధరామయ్యపై వేటు తప్పదా అని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జోరందుకుంది.

# నీతిష్ ఆదర్శం.. ప్రత్యేక హోదా తెండి–చంద్రబాబుకు షర్మిల్ సలహా

## –నితీష్ ప్రత్యేక హోదా అంటున్నారు
## –కింగ్ మేకర్ మీరు మౌనమేల
## –15 ఏళ్లు ప్రత్యేక హోదా అని గోల పెట్టారుగా
## –ఇప్పుడు అవకాశం వచ్చింది..
## –అసెంబ్లీలో తీర్మాణం చేయండి..
## –మోడీ ముందు పెట్టండి

అమరావతి, జూన్ 29 : తమకు ప్రత్యేక హోదా కావాలని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తీర్మానం చేసి ప్రధాని మోదీ ముందు పెట్టారని, కానీ ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం ప్రత్యేక హోదాపై ఇప్పటి వరకు నోరు ఎందుకు మెదపడం లేదని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో కింగ్ మేకర్‌గా ఉన్న చంద్రబాబు హోదా విషయంలో సైలెంట్‌గా ఎందుకున్నారని, ఈ విషయంలో ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజధాని లేని రాష్ట్రంగా బీహార్ కంటే ఏపీ వెనుకబడి వుందని, హోదా కావాలని 15 ఏళ్లు అడిగిన విషయం మీకు గుర్తులేదా అని చంద్రబాబును షర్మిల ప్రశ్నించారు.

"రాష్ట్రాభివృద్ధిలో ఏపీ 20 ఏళ్లు వెనకబడిందని చెప్పింది మీరే కదా. హోదా ఇవ్వకుంటే మద్దతు ఉపసంహరిస్తామని ఎందుకు అనడం లేదు. మోసం చేసిన మోదీతో హోదాపై సంతకం ఎందుకు పెట్టించలేరు.. ప్రత్యేక హోదాపై మీ వైఖరి ఏంటో చెప్పాలి. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం ముందు హోదా డిమాండ్‌ను పెట్టాలి" అని చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని షర్మిల తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీలు కాదని, రాష్ట్రాభివృద్ధికి హోదా ఒక్కటే మార్గమని మరోమారు గుర్తుచేస్తున్నట్టు షర్మిల పేర్కొన్నారు.

# నివాసాలలోకి దూసుకెళ్లిన లారీ

## - పలు వాహనాలు, ఇళ్ళు ధ్వంసం

అమరావతి, జూన్ 29 :శ్రీ సత్యసాయి బ్యూరో (ప్రభన్యూస్):శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తనకల్లు మండల సమీపంలో పరాకువాండ్లపల్లిలో సోమవారం తెల్లవారుజామున ఒక లారీ నివాసాల్లో కి దూసుకెళ్లింది. సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు . అదేవిధంగా ఒక ఆటో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం కాగా రెండు మూడు నివాసాలు నేలమట్టమయ్యాయి.

డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రైనేజీ నిర్మాణాన్ని దాటుకొని లారీ మరి ఇళ్లల్లోకి వెళ్లడం జరిగింది. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు.

సంఘటన స్థలానికి తనకల్లు పోలీసులు చేరుకొని, లారీ డ్రైవర్ ను శిథిలాలలో నుంచి బయట కు తీసి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఐతే డ్రైవర్ చికిత్స పొందుతూ మరణించి నట్లు సమాచారం.

# సమతా మూర్తిని సందర్శించిన కేంద్ర మంత్రి ప్రియుష్ గోయల్



న్యూఢిల్లీ, జులై 1 :కేంద్ర మంత్రి ప్రియూష్ గోయల్ ఈరోజు శంషాబాద్‌లో సమీపంలో ఉన్న సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. సుమారు మూడు గంటల పాటు సమతామూర్తి సన్నిధిలో ఉన్నారు. స్వర్ణ రామజులవారి వేద ఆశీస్సులు తీసుకున్న అనంతరం శ్రీ చిన్న జీయర్ స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

## వంజరి కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### - ఉప్పల్ బాగయత్ లో ఆత్మగౌరవ భవనని కి ఐదు కోట్లు కేటాయించి ప్రభుత్వమే నిర్మాణం చేపట్టాలి



మెదక్ జులై 1(ఎక్స్ ప్రెస్ న్యూస్ : లంగాణ రాష్ట్ర ప్రభుత్వం వంజరి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కులంలో ఉన్న బీద కుటుంబాలను ఆదుకోవడానికి ఆర్థికంగా సహకరించాలని తెలంగాణ వంజరి సేవా సంఘం కోర్ కమిటీ డిమాండ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఆదివారం మెదక్ జిల్లా ఏడుపాయల లో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ, వంజరి కులస్తులకు ఒక ఎమ్మెల్సీ పదవి నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఉప్పల్ బగాయతులో వంజరి కుల ఆత్మగౌరవ భవనం నిర్మించడానికి ఐదు కోట్ల నిధులు మంజూరు చేసి ప్రభుత్వమే దానిని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఆ భవనంలో రాష్ట్రంలో ఉన్న రిజిస్టర్ సంఘాలకు ప్రాతినిధ్యం ఉండాలని ధనిక, బీద తేడా లేకుండా కులస్తులందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అఖిలభారత వంజరి సేవా సంఘం జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు సాల్వేర్ కృష్ణ వంజరి మాట్లాడుతూకేంద్ర మంత్రివర్గంలో వంజరులకు స్థానం కల్పించాలని, ,2014లో బిజెపి అధికారంలోకి రావడానికి విశేష కృషి చేసిన స్వర్గీయ గోపీనాథ్ ముండే మరణానంతరం కేంద్ర క్యాబినెట్ లో ఉన్న డాక్టర్ భగవత్ కిషన్ రావు కరాడ్ వంజరి కి తిరిగి అవకాశం కల్పించకపోవడం బాధాకరమని ఆ లోటును భర్తీ చేయడానికి వంజరి కులస్తులకు కేంద్ర క్యాబినెట్లో చోటు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఒకే కులం- ఒకే రిజర్వేషన్ విధానం అవలంబించి జాతీయస్థాయిలో వంజరులకు డిఎన్ టీ హోదా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ వంజరి సేవా సంఘం అధ్యక్షులు ఎదగని శంకర్ నారాయణ ప్రధాన కార్యదర్శి దాత్రిక ధర్మరాజులు మాట్లాడుతూ, ఈరోజు సమావేశంలో చర్చించిన అంశాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకురావడానికి ప్రభుత్వ పెద్దలను కలిసి వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎదుగని హరినాథ్, , కార్యదర్శిలు ఎదగని రామకృష్ణ సారంగు (బొట్టు )సత్యము, వై లక్ష్మణ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు

## ఆ ఆరు వందల కోట్లతో ఒక జిల్లాను అభివృద్ధి చేయవచ్చు - ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

### -జగన్ దుబారా ఖర్చులపై పవన్ కల్యాణ్ రుసరుస
### -అభివృద్ధి అనేది వైసిపి పాలనలో లేదు
### -అందినకాడికి దోచుకోవడం .. దాచుకోవడమే
### -తాను మాటలు చెప్పనని,చేసి చూపుతానన్న ఉప ముఖ్యమంత్రి
### -గొల్లప్రోలులో పించన్లు పంపిణి
### -ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జీతం తీసుకోను

పిఠాపురం, జులై 1 : మాజీ సీఎం జగన్ రూ.600 కోట్లతో రుషికొండలో ప్యాలెస్ కట్టారని.. అది గత వైసీపీ ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ . అదే రూ.600 కోట్లతో ఒక జిల్లాలో పూర్తిగా అభివృద్ధి జరిగేది అని తెలిపారు. ప్రతి శాఖలో పారదర్శకత, జవాబుదారీ తనం తీసుకొస్తా అన్నారు. తప్పు చేస్తే తననయినా ప్రశ్నించండి అని ప్రజలకు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని




గొల్లప్రోలులో పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులు పించన్ లు అందజేశారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిఠాపురం ప్రజలకు రుణపడి ఉంటా అని అన్నారు. మంత్రిగా కీలక శాఖల బాధ్యతలు తీసుకున్నా అని.. ఎక్కువ మాటలు చెప్పను.. ఎక్కువ పని చేస్తా అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే పెన్షన్లు తీసేస్తామని భయపెట్టారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తం పెన్షన్ ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షన్ల పంపిణీతో పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకున్నానని అన్నారు.

తనకు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ముఖ్యమని అంటూ సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలన్నారు పవన్ కల్యాణ్. గత ప్రభుత్వం పంచాయతీ రాజ్ నిధులు దారి మళ్లించిందన్నారు. ఓటు వేయకపోయినా ఏ పార్టీ వారైనా ప్రశ్నించవచ్చన్నారు. హంగులకు, ఆర్భాటాలకు తాను వెళ్లనని పవన్ అన్నారు. అవినీతి చేయనని ప్రజలకు మాట ఇస్తున్నా అన్నారు.

డబ్బు వెనకేసుకోవాలని ఎప్పుడూ ఆలోచించనని తెలిపారు. పిఠాపురంలో 620 గ్రామ సచివాలయాలు ఉన్నాయని.. ప్రతి సెక్రటేరియట్లో 10 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. గతంలో 4 రోజులు ఇచ్చే పెన్షన్ ఒక రోజులో ఇస్తున్నామన్నారు. వాలంటీర్లు లేకపోతే పెన్షన్లు ఆగిపోతాయని భయపెట్టారని వాలంటీర్లు లేకపోతే పెన్షన్ పంపిణీ ఎక్కడ ఆగిందన్నారు.

జీతం తీసుకోను..

ముందుగా తాను ఎమ్మెల్యేగా వచ్చే జీతం తీసుకోవాలని భావించానని, అయితే ప్రభుత్వంలో అప్పులు చూసిన తర్వాత జీతం [illegible] ని నిర్ణయించుకున్నానన్నారు పవన్ కల్యాణ్ . అలాగే తనకు కేటాయించిన క్వార్టర్ మరమ్మత్తులు, ఫర్నిచర్ లు ప్రభుత్వం సొమ్ముతో కాకుండా తన స్వంత సొమ్ముతో సమకూర్చుకుంటానని చెప్పారు..

## కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా సమక్షంలో, హరియాణా ప్రభుత్వం, గాంధీనగర్లోని ఎన్ఎఫ్ఎస్యు మధ్య పంచకులలో ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, జులై 1 :కేంద్ర హోం మంత్రి, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆధ్వర్యంలో హరియాణా ప్రభుత్వం- నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయం (ఎన్ఎఫ్ఎస్యు), గాంధీనగర్ మధ్య నేడు హరియాణా పంచకులలో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. కేంద్ర మంత్రి శ్రీ మనోహర్ లాల్, హరియాణా ముఖ్యమంత్రి శ్రీ నయాబ్ సింగ్ తో సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ, ఎన్ఎఫ్ఎస్యు సహకారంతో, నేడు హరియాణాలో నేర న్యాయ వ్యవస్థకు శాస్త్రీయ పునాది వేయడానికి కృషి చేసినట్లు చెప్పారు. బ్రిటీష్ కాలం నాటి మూడు చట్టాలు భారత న్యాయవ్యవస్థను శాసిస్తున్నాయని, సత్వర న్యాయం, అందరికీ న్యాయం అనే భావనతో వాటిని మార్చామని చెప్పారు. ఈ చట్టాల్లో మార్పుల్లో భాగంగా ఇప్పుడు ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే నేరాలకు ఫోరెన్సిక్ బృందం సందర్శనలను తప్పనిసరి చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా ఫోరెన్సిక్ నిపుణులకు అవసరం పెరుగుతుందని..., దీనిని ఎన్ఎఫ్ఎస్యు తీరుస్తుందని మంత్రి తెలిపారు. ఈ కొత్త నేర చట్టాలను అమలు చేయడానికి మానవ వనరులను సృష్టించాల్సిన అవసరం ఉందని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ విధానంతోనే నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్శిటీని ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఈ కొత్త చట్టాల రూపకల్పన కూడా జరుగుతోంది. ఇప్పటివరకు 9 రాష్ట్రాల్లో ఈ విశ్వవిద్యాలయాల ప్రాంగణాలను ప్రారంభించామని, దేశంలోని 16 రాష్ట్రాలకు ఈ విశ్వవిద్యాలయాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

దీనివల్ల శిక్షణ పొందిన సిబ్బందిని సృష్టించడంతో పాటు నేరాలను ఛేదించే వేగాన్ని పెంచడానికి, శిక్షరేటును పెంచడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. దీనివల్ల శిక్షణ పొందిన మానవ వనరులు సమకూరడమే కాకుండా కొత్త చట్టాలు క్షేత్రస్థాయిలో అమలు కావడానికి ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు.

ఒకే ప్రాంగణంలో ప్రయోగశాల, విశ్వవిద్యాలయం, శిక్షణా సంస్థ ఉండటం వల్ల బోధకులకు, నేర్చుకునే విద్యార్థులకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని కేంద్ర హోం మంత్రి అన్నారు. ఇక్కడ శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలనుకుంటే భారత ప్రభుత్వం సొంత ఖర్చులతో ఫోరెన్సిక్ సైన్స్‌లో శిక్షణకు మంచి ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు విద్యను బోధించడానికి, సుశిక్షితమైన మానవ వనరులను సిద్ధం చేయడానికి మాత్రమే కాకుండా ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతుందని ఆయన అన్నారు. ఢిల్లీ, పంజాబ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ పోలీసు సబ్ ఇన్స్పెక్టర్లు(పీఎస్ఐలు), డీఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారులు, న్యాయమూర్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నేడు తీసుకున్న ఈ నిర్ణయం రానున్న రోజుల్లో హరియాణా నేర న్యాయ వ్యవస్థలో గొప్ప మార్పులను తీసుకువస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం..

అమరావతి, జులై 1 :ఏపీలో రేపు (జులై 1) ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెరిగిన పెన్షన్ రూ.4 వేలతో పాటు, ఏప్రిల్ నుంచి మూడు నెలల పెంపు రూ.3 వేలతో కలిపి రేపు రూ.7 వేలు అందించనున్నారు. కూటమి ప్రభుత్వం మొదటి నెల నుంచే ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం చుట్టింది.

కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటుండడం విశేషం. మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో లబ్ధిదారులకు చంద్రబాబు స్వయంగా పింఛను ఇవ్వనున్నారు. జులై 1న రాష్ట్ర వ్యాప్తంగా 65.31 లక్షల మందికి దాదాపు 1,20,097 మంది సిబ్బందితో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి అధికార యంత్రాంగం సమాయత్తమైంది.మొత్తం 28 విభాగాలకు చెందిన లబ్ధిదారులకు పెంచిన పింఛను అందజేయనున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్య కారులు, కళా కారులు, డప్పు కళాకారులు, ట్రాన్స్ జెండర్స్ వంటి వారికి ఇకపై రూ.4000 పింఛను ఇవ్వనున్నారు. దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ ను రూ.3000 నుంచి ఒకేసారి రూ.6000 పెంచారు. తీవ్ర అనారోగ్యంతో ఉండే వారికి ఇచ్చే పింఛను రూ.5000 నుంచి రూ.15000 పెంపుదల చేశారు. ఈ విభాగంలో 24,318 మంది పెన్షన్ అందుకోనున్నారు.

## కొత్త ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ జులై 1 : (ఎక్స్ ప్రెస్ న్యూ స);: కొత్త ఆర్మీ చీఫ్ గా జనరల్ ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు స్వీకరించారు. భారత 30 ఆర్మీ చీఫ్ గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతమున్న ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు తీసుకున్నారు.తన 40 ఏళ్ల సర్వీసులో ద్వివేది అనేక బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా గతంలో విశిష్ట సేవా పతకం కూడా ఆయనకు లభించింది. కశ్మీర్, రాజస్థాన్ ఉగ్రవాద వ్యతిరేక డ్రైవ్ లో ఆయన బెటాలియన్లకు నాయకత్వం వహించారు.

## వెంకయ్యనాయుడు సేవలను దేశం ఎప్పటికీ మరవదు: మోడీ

న్యూ ఢిల్లీ జులై 1 : (ఎక్స్ ప్రెస్ న్యూ స):: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడితో సుదీర్ఘకాలం పని చేసే అవకాశం తనకు దక్కిందని, గ్రామ స్థాయి నుంచి ఉన్నత స్థానానికి ఆయన ఎదిగారని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. మహానేత వెంకయ్యనాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఆయన జీవితం, ప్రయాణం పుస్తకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోడీ ప్రసంగించారు. ఆయన జీవితంపై పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయని కొనియాడారు. ఈ పుస్తకాలే దేశ ప్రజల సేవకు మార్గనిర్దేశనం చేస్తాయని, వేలాది కార్యకర్తలు వెంకయ్య నుంచి ఎంతో నేర్చుకున్నారని, ఎమర్జెన్సీ సమయంలో వెంకయ్య పోరాటం చేయడంతో పాటు 17 నెలలు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు.గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖలో తనదైన ముద్ర వేశారని, స్వచ్ఛభారత్, అమృత్ యోజన వంటి ఎన్నో పథకాలు సమర్థంగా అమలు చేశారని, వెంకయ్య చాతుర్యం, వాగ్ధాటి ముందు ఎవరూ నిలువలేరన్నారు. రాజ్య సభ చైర్మన్ గా సభను సజావుగా నడిపారని, ఆయన సేవలను దేశం ఎప్పటికీ మరవదని, ఆర్టికల్ 370 రద్దు బిల్లు తొలుత రాజ్యసభ ముందుకు వచ్చిందని, ఈ బిల్లు విషయంలో వెంకయ్య కీలక పాత్ర పోషించారని మోడీ కొనియాడారు. రాజ్య సభ నిర్వహణలో వెంకయ్య అనుభవం చాలా ఉపయోగపడిందని, దీర్ఘకాలం వెంకయ్య ఆరోగ్యంగా ఉండి మార్గనిర్దేశం చేయాలని కోరారు.

## మరోసారి తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.30 తగ్గింపు

న్యూ డిల్లీ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు ఉపశమనం కలిగించాయి. మరోసారి తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర.. తగ్గింది వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.30 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అంటే జులై 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించాయి.చమురు సంస్థల నిర్ణయంతో దేశ రాజధాని ఢిల్లీలో రూ. 1,676గా ఉన్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,646కి తగ్గింది. అదేవిధంగా ముంబైలో రూ.1,629 నుంచి రూ.1,598కి తగ్గింది. ఇక చెన్నైలో రూ.1,840గా ఉన్న ధర ఇప్పుడు రూ.1,809కి పడిపోయింది. అదేవిధంగా కోల్‌కతాలో రూ.1,787 ఉన్న కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,756కి తగ్గింది. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. కాగా, వరుసగా గత రెండు నెలల నుంచి కమర్షియల్ సిలిండర్ ధరలు తగ్గుతూ వస్తున్న విషయం తెలిసిందే. జూన్1న ఎల్పీజీ రేటు దాదాపు రూ.69 తగ్గగా, మే 1న సిలిండర్‌పై రూ.19 తగ్గింది. ఇక 14.2 కిలోల గృహ వినియోగ వంటగ్యాస్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి

## ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉంది

### -మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

హైదరాబాద్ జులై 1 : (ఎక్స్ ప్రెస్ న్యూస్ :: దేశ ప్రజలకు ప్రధాని అందిస్తున్న సేవలు కొనసాగించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. రిఫార్మ్, పర్ఫార్మ్, ట్రాన్స్ ఫార్మ్ నినాదంతో ముందుకెళ్తున్నారని, అవసరం ఉన్నంత వరకు ఉచిత రేషన్ పథకం కొనసాగించాలన్నారు. మహానేత వెంకయ్యనాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఆయన జీవితం, ప్రయాణం పుస్తకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. యువతకు నైపుణ్యం శిక్షణ కార్యక్రమాలను కొనసాగించాలని, మాతృభాషలను ప్రోత్సహించడం గొప్ప విషయం కితాబిచ్చారు. తాను ఆంగ్ల భాషకు వ్యతిరేకం కాదు అని, ప్రభుత్వ ఆదేశాలన్నీ భారతీయ భాషల్లో ఉండాలని, ఆ తరువాతే ఆంగ్ల భాషలో ఉండాలని కోరుతున్నామని, మాతృభాష, సోదర భాష తర్వాతే ఇతర భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలని వెంకయ్య పేర్కొన్నారు.ఉత్సాహం ఉన్నవాళ్లు రాజకీయాల్లోకి రావాలని, సిద్ధాంతపరమైన రాజకీయాలను ప్రోత్సహించాలని, చట్ట సభలకు ఎంపికైనవారు హుందాగా ప్రవర్తించాలని, విలువలు పాటిస్తూ మాతృభాషను ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. విలువలు కాపాడాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటున్నారో తెలియడం లేదన్నారు. సిద్ధాంతం నచ్చకపోతే నాయకులు పార్టీ మారవచ్చని, పార్టీ ద్వారా వచ్చిన పదవిని వదిలి వెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు నేతలు ప్రవర్తనా నియమావళి రూపొందించాలని, రాజకీయాల్లో జవాబుదారీతనం తీసుకురావాడానికి ప్రయత్నించాలని, రాజకీయాల్లో కులం, ధనం ప్రభావం తగ్గిపోవాలని పిలు?పునిచ్చారు. గుణం చూసి నాయకులకు ఓటు వేయాలని, మార్పు రాకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుందని, దేశ ప్రతిష్ఠను నిలబెట్టాలంటే చెడుపోకడలను అడ్డుకోవాలని వెంకయ్య నాయుడు సలహాలు ఇచ్చారు.

## బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు చెల్లు..

న్యూఢిల్లీ జులై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కలోనియల్ యుగం క్రిమినల్ కోడ్‌లు కొత్తగా అమలులోకి వచ్చిన 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత , భారతీయ సాక్ష్యా అధినియమ్'లకు సోమవారం నుండి మార్గం కల్పిస్తాయి, నేరాలను పూర్తిగా మారుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ కొత్త క్రిమినల్ చట్టాలు జులై 1 నుంచి అమలులోకి వస్తాయి. ఇది దేశంలో క్రిమినల్ జస్టిస్ సిస్టంను పూర్తిగా మార్చేస్తాయి.ఈ కొత్త క్రిమినల్ చట్టాలలో 'రాక్షసత్వ అంశాలు'(డ్రాకొనియన్ ప్రావిజన్స్) ఉన్నాయని, దానిని పున: పరిశీలించడానికి ప్రతిపక్షం డిమాండ్ చేసింది. అయినప్పటికీ ఈ కొత్త చట్టాలు జులై 1 నుంచి అమలులోకి రానున్నాయి.పార్లమెంటులో 2023డిసెంబర్ 21 ఈ కొత్త కోడ్స్ ను ఆమోదించింది. నాలుగు రోజుల తర్వాత రాష్ట్రపతి వాటికి ఆమోదం తెలిపింది. 2024 ఫిబ్రవరి 24న ఈ కొత్త క్రిమినల్ చట్టాలు జులై 1 నుంచి అమలులోకి వస్తాయని ప్రకటించింది. దీంతో 163 ఏళ్లుగా కొనసాగుతున్న ఇండియన్ పెనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత అమలు కాబోతోంది.

## బొగ్గు బ్లాకుల వేలం పాటలను రద్దు చేయాలి

### -ఐ ఎఫ్ టు యు.శ్రామిక స్పందనరాష్ట్ర అధ్యక్షులు ఎస్ సుధాకర్

నిజామాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడి ప్రభుత్వం దేశంలోని బొగ్గు బ్లాకులను వేలం పాటలను చేపట్టిందని, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభించే అట్టి వేలం పాటలను తక్షణమే రద్దు చేయాలని ఐ ఎఫ్ టు యు. శ్రామిక స్పందనరాష్ట్ర అధ్యక్షులు ఎస్ సుధాకర్ డిమాండ్ చేసారు.. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి కంపెనీలాగా చూడకూడదని, దాని వెనకాల లక్షలాది మంది ప్రత్యక్షంగా. పరోక్షంగా ఉపాధి పొందుతున్నారనే విషయాన్ని కేంద్రం దృష్టిలో పెట్టుకోవాలి. విభజన హామీల్లో భాగంగా బీజేపీ ప్రభుత్వంసింగరేణికి సహకరిస్తామని చెప్పడం జరిగిందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటించి నేటి వరకు అమలు చేయలేదని, సింగరేణి సంస్థకు ఆర్థికంగా సహకరించకుండా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా సింగరేణి




ఖర్చు పెట్టుకొని టేక్ ఓవర్ చేస్తున్న బ్లాకులను సింగరేణికి ఇవ్వాలని, శ్రావణపల్లి, బ్లాక్ ను సింగరేణికి కేటాయించాలని కోరారు. నూతన గనుల అనుమతులన్ని కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉన్నాయి వాటికి తక్షణమే అనుమతించాలని, మరిన్ని నూతన ప్రాజెక్టులు రాకుంటే 2030 వరకు సింగరేణి పరిశ్రమ మూతపడే అవకాశం ఉన్నందున దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గని కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు తెలంగాణ నుండి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సింగరేణి పరిరక్షణకు తన వంతు చొరవ, సహకారం అందించాలి. సింగరేణిలో బ్లాకుల వేలంను ఆపాలని డిమాండ్ చేసారు

## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని పాలమూరు వర్సిటీలో బీఆర్ఎస్వీ నాయకుల నిరసన

మహబూబ్‌నగర్, జులై 1 :అలవిగానీ హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి ఏర్పడుతున్నది. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు హామీల అమలు కోసం రోడ్లు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. తాజాగా పాలమూరు వర్సిటీలో విద్యార్థులు నిరసనకు దిగారు. గద్దెనెక్కిన వెంటనే లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి వంద రోజుల్లోనే నెరవేరస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా ఇవ్వడం లేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయం ప్రధాన ముఖ ద్వారం వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ కన్వీనర్ గద్దం భరత్‌బాబు మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని ధ్వజమెత్తారు.

గ్రూప్-1, మెయిన్స్‌కు 1:100 ప్రకారం ఎంపిక చేయాలని, గ్రూప్-2లో 2000, గ్రూప్-3లో 3 వేల పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి కేవలం 12 వేల పోస్టులతో బిచ్చం వేసినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదన్నారు. ఉస్మానియా జేఏసీ నేత మోతిలాల్ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దవాఖానకు వెళ్లి మోతిలాల్ చేపట్టిన దీక్షను విరమింప జేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. పించన్‌లు పంపిణీ చేయనున్న జన సేనాని



పిఠాపురం, జూన్ 29 : ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేటి నుంచి మూడు రోజుల పాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో తొలిసారి పవన్ కల్యాణ్ పర్యటించనున్నారు.

ఈ నేపథ్యం లో నేటి ఉదయం 7.30 గంటలకు విమానం లో రాజమండ్రికి చేరు కున్నారు. ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా పిఠాపురం బయలుదేరారు..ఇక గొల్లప్రోలు సత్యకృష్ణ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సామాజిక. ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు . లబ్ది దారులకు పెన్షన్ లు స్వయంగా పవన్ అందజేస్తారు

మధ్యాహ్నం చేబ్రోలు నివాసంలో పిఠాపురం జనసేన నేతలతో భేటీ కానున్నారు2వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు పంచాయితీ, అటవీ కీలక శాఖలపై సమీక్ష చేపట్టనున్నారు. మధ్యాహ్నం జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో కీలక భేటీ నిర్వహించనున్నారు.

జులై 3న ఉప్పాడ, యు.కొత్తపల్లిలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం టీడీపీ, బీజేపీ కీలక నేతలతో భేటీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పిఠాపురంలో వారాహి బహిరంగ సభలో పాల్గొననున్నారు. తర్వాత హెలికాప్టర్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడ తిరుగు ప్రయాణం కానున్నారు.

# స్వార్థ రాజకీయాలకే పార్టీలు మారుతున్నారు - కెటిఆర్



జగిత్యాల, జూలై 1 : స్వార్థ రాజకీయాలకే కొందరు ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారని, పార్టీ ఫిరాయింపులను మొదలు చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, గాలికి గడ్డి పోసలే ఎగిరిపోతాయని, బిఆర్ఎస్ కార్యకర్తలు గడ్డపార లాంటి వారిని, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు దమ్ముంటే రాజీనామా చేసి, మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని, జగిత్యాలకు పట్టిన శని పోయిందని, బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన జగిత్యాల బిఆర్ఎస్ పార్టీ నాయకుల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై గెలిచి పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన స్వార్థానికి పార్టీ మారారని, జగిత్యాలకు పట్టిన శనిపోయిందని, కష్టకాలంలోనే మనుషుల విలువ తెలుస్తుందని, గాలికి గడ్డి పూసలే ఎగిరిపోతాయని గడ్డపారలు ఎగిరిపోవన్నారు. జగిత్యాల ప్రజలు ఎమ్మెల్యేగా ఎమ్మెల్యేగా గెలిపిస్తే రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకుల కోసం ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారారని, ఇప్పుడు జగిత్యాల అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు ఎమ్మెల్యే మాట్లాడుతున్న మాటల్లో వాస్తవం లేదని, జగిత్యాలను జిల్లా చేసి మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని, రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా జగిత్యాలలో 4520 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించామని, గత పది ఏళ్లలో జగిత్యాలను ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ తన స్వార్ధ ప్రయోజనాల కోసమే పార్టీ మారారని, సంజయ్ కు దమ్ముంటే ఎమ్మెల్యేగా రాజీనామా చేసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని సవాల్ విసిరారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీయేనని, నాడు ఇందిరాగాంధీ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్లో చేర్చుకున్నారని గుర్తు చేశారు. 2014లో కాంగ్రెస్ మెడలు వంచి స్వరాష్ట్ర తెలంగాణను సాధించామని, బిఆర్ఎస్ పార్టీ ఒక్కొక్క ఎమ్మెల్యేను చేర్చుకోలేదని, రాజ్యాంగబద్ధంగానే 2/3 శాతం ఎమ్మెల్యేలు పార్టీలో చేరారని గుర్తు చేశారు. ఎన్నికల కంటే ముందు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరితే రాళ్లతో కొట్టి చంపాలని మాట్లాడారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలో చెప్పాలన్నారు. కాంగ్రెస్లో చేర్చుకున్న ఆరుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కి సవాల్ విసిరారు.

పార్టీ ఫిరాయిస్తే సభ్యత్వాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలు పేర్కొందని, ఇప్పుడు ఇతర పార్టీ ఎమ్మెల్యేలను ఇలా చేర్చుకుంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చిందని, గత ప్రభుత్వ అమలు చేసిన రైతుబంధు, పెన్షన్ల సంక్షేమ పథకాలను సైతం అమలు చేయడం లేదని, ఉచిత కరెంట్ అని చెప్పి కరెంటు లేకుండా చేస్తున్నారన్నారు. గొర్రెలు, బర్రెలు కొన్నట్లుగా ఎమ్మెల్యేలను కాంగ్రెస్లో చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 స్థానాల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందామని, బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే ముఖ్య బలమని, మధ్యలో వచ్చిన నాయకులు మధ్యలో వెళ్లిపోయారని, పార్టీకి కార్యకర్తలు ముఖ్యమని, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్య పడకుండా ధైర్యంతో ఉండాలన్నారు.

8 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యకర్తలు ఎవరు భయపడకుండా బాధపడకుండా ఉండాలని, కార్యకర్తలు అందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని ఆత్మహత్యలే ఉంటాయని, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీ మారి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సమాజం చీలిందని, దేశంలో బలమైన రాజకీయ పార్టీలు ఉన్నాయని, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు పార్టీలకు అనుకున్న ఫలితాలు రాలేదని, బిఆర్ఎస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, నిత్యం ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకే రవిశంకర్, కోరుకంటి చందర్ , జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, నాయకులు చిన్నమనేని లక్ష్మీనరసింహారావు, సర్దార్ రవీందర్ సింగ్, శ్రీకాంత్ రెడ్డి, వివిధ మండలాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ అంకుర సంస్థల కాన్ఫరెన్స్ ఆర్ఏసీఈ 2024 ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 1 :ఆలోచనా విధానంలో మార్పు, ప్రాంతీయ వనరుల అన్వేషణ జమ్ము కశ్మీర్లో అంకుర సంస్థలకు కీలకం అని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో, అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ అన్నారు. జమ్ముకశ్మీర్ లోని శ్రీనగర్ లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ అంకుర సంస్థల కాన్ఫరెన్స్ ఆర్ఏసీఈ 2024 ముగింపు కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు.

గత దశాబ్ద కాలంలో భారతదేశంలో అంకుర సంస్థల ఉద్యమం పెద్ద ఎత్తున ఊపందుకుందని డా. జితేంద్ర సింగ్ అన్నారు. ఈ ఘనత స్వాతంత్ర్య దినోత్సవం రోజు, ఎర్రకోట నుంచి 'స్టార్టప్ ఇండియా-స్టాండప్ ఇండియా' పిలుపునిచ్చిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకే దక్కుతుందని కేంద్రమంత్రి డా. జితేంద్ర సింగ్ అన్నారు. అప్పట్లో దేశంలో అంకురాల సంఖ్య కేవలం 350-400 మాత్రమేనని, నేడు అది 1.5 లక్షలకు పెరిగిందని ఆయన తెలిపారు. అంకుర సంస్థల సంఖ్య విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా 3వ స్థానంలో ఉందని ఆయన గుర్తు చేశారు.

డా. జితేంద్ర సింగ్ సమావేశంలో ప్రసంగిస్తూ, గత కొన్ని సంవత్సరాలుగా స్టార్టప్ ఉద్యమం ఈ ప్రాంతంలో సమాన వేగంతో ముందుకు సాగలేదు. జమ్ముకశ్మీర్ వంటి కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగం ప్రధాన జీవనోపాధి వనరుగా ఉండటం, ఇది యువతతో పాటు తల్లిదండ్రుల మనస్తత్వాన్ని మార్చడమే ఇందుకు కారణమని ఆయన అన్నారు. కాబట్టి రోజ్‌గార్ అంటే సర్కారీ నౌకరీ మాత్రమే కాదని, వేతనం పొందే ప్రభుత్వ ఉద్యోగంతో పోలిస్తే కొన్ని అంకుర మార్గాలు మరింత లాభదాయకంగా ఉంటాయని, వాటిపట్ల అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని మంత్రి తెలిపారు.

ప్రాంతీయ వనరులను అన్వేషించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన డా. జితేంద్ర సింగ్, అంకురాల గురించి మాట్లాడేటప్పుడు ఏదో విధంగా మనస్తత్వం ఐటీతో ఇరుక్కుపోతుందని, అయితే జమ్మకశ్మీర్ వంటి ప్రాంతంలో వ్యవసాయ రంగం అంకుర సంస్థలకు ప్రధాన ప్రాంతంగా ఉండాలని అన్నారు. అరోమా మిషన్ ఉదాహరణను ప్రస్తావిస్తూ, పర్పుల్ విప్లవం భదేర్వా గుల్‌మార్గ్ వంటి చిన్న పట్టణాల నుండి పుట్టిందని.., ఇది ఇప్పుడు దేశవ్యాప్తంగా మాట్లాడుకుంటున్నారని అన్నారు. పర్పుల్ రివల్యూషన్ శకటం కూడా జనవరి 26 న దిల్లీలోని కర్తవ్య పథ్ వద్ద ప్రదర్శించబడిందని ఆయన అన్నారు. దాదాపు 5 వేల మంది యువకులు వ్యవసాయ అంకుర సంస్థ ద్వారా లావెండర్ వ్యవసాయాన్ని చేపట్టి మంచి ఆదాయాన్ని ఆర్జిస్తునారన్నారు. వారి ప్రోత్సాహంతో కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్న కొందరు యువకులు కూడా తమ ఉద్యోగాన్ని వదిలేసి లావెండర్ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. జమ్ముకశ్మీర్ ఉదాహరణను ఇప్పుడు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, కొన్ని ఈశాన్య రాష్ట్రాలు కూడా అనుకరిస్తుండటమే అరోమా మిషన్ విజయానికి నిదర్శనమన్నారు. జమ్ముకశ్మీర్ విషయానికొస్తే, పూల మొక్కలు పెంచే రంగంలో కూడా వ్యవసాయ అంకుర ప్రాంతాలను అన్వేషించడం సాధ్యమని, దీని కోసం సీఎస్ఐఆర్ ఫ్లోరికల్చర్ మిషన్ ను ప్రారంభించిందని డా. జితేంద్ర సింగ్ తెలిపారు.

# నిరుద్యోగుల జీవితాలతో చలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- కెసిఆర్ లాగే మూల్యం రేవంత్ కుడా చెల్లించుకోక తప్పదు

- జులై 2వ తేదీన రాష్ట్రంలోని అన్ని ఎమ్మార్వో ఆఫీసుల ఎదుట నిరసనలు

-జులై 5వ తేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసనలు చేపడుతాం

- భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్



హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వేదనకు గురిచేస్తోందని భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ విమర్శించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అశోక్ నగర్ లో నిర్వహించిన ప్రచారంలో రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే నిరుద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చిన విశయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసారు. నిరుద్యోగుల పక్షాన అమరవీరుల స్థూపం సాక్షిగా భారతీయ జనతా యువమోర్చా అనేక నిరసన కార్యక్రమాలతో పోరాటం చేస్తున్నాం. గ్రూప్-1 మెయిన్స్ ఎలిజిబిలిటీ 1:100కు పెంపు, -గ్రూప్-2లో పోస్టుల పెంపు, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నిర్వహణ వంటి డిమాండ్లు నెరవేర్చాలా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. నిరుద్యోగులకు అండగా నిలబడేలా రాష్ట్ర వ్యాప్తంగా యువతకు భరోసా కలిగించేలా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో జులై 2వ తేదీన రాష్ట్రంలోని అన్ని ఎమ్మార్వో ఆఫీసుల ఎదుట నిరసన కార్యక్రమం, జులై 5వ తేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసనలు చేపడుతాం. విద్యార్థులు, నిరుద్యోగులపై దాడులకు తెగబడి, అక్రమ కేసులు బనాయిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని మహేందర్ హెచ్చరించారు.

బిజెపి యువమోర్చా నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గం

బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద ఒక పోలీస్ అధికారి బిజెపి యువమోర్చా నాయకున్ని అరెస్టు చేస్తూ కొట్టడం, అసభ్య పదజాలంతో దూషించడాన్ని మహేందర్ తీవ్రంగా ఖండించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆ పోలీస్ అధికారిని సస్పెండ్ చేయాలని బీజేపీ రాష్ట్ర యువమోర్చా డిమాండ్ చేసింది.ఏ విధమైన కారణం లేకుండా బిజెపి యువమోర్చా నాయకులను పోలీస్ అధికారులు అరెస్టు చేయడం దుర్మార్గం. నిరుద్యోగ సమస్య పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం పోలీసు అధికారుల చేత అణిచివేయాలనే నిరంకుశ వైఖరి సరైంది కాదు. దీనిపైన తగిన విచారణ చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆ పోలీస్ అధికారి పై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మహేందర్ హెచ్చరించారు.

# ఎన్ఐఎస్ పాటియాలాను సందర్శించిన కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి.. పారిస్ ఒలింపిక్స్ అథ్లెట్లకు ప్రోత్సాహం

న్యూఢిల్లీ, జులై 1 :ఒలింపిక్స్ కు వెళ్తున్న అథ్లెట్లు వెయిట్ లిఫ్టర్ మీరాబాయ్ చాను, జావెలిన్ త్రోయర్ అనరాణి, షాట్ పుటర్ అభా ఖతువాలను కలిసేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు; కార్మిక, ఉపాధికల్పన శాఖల మంత్రి డాక్టర్ మన్ సుఖ్ మాండవీయ నేడు పాటియాలాలో నేతాజీ సుభాశ్ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ను సందర్శించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న నూతన మౌలిక వసతుల పురోగతిని కూడా ఆయన పరిశీలించారు.

"మీరాబాయి, అనూ రాణి, అభాలతో నా సంభాషణను బట్టి 2024 పారిస్ ఒలింపిక్స్ కు సిద్ధం అయ్యే విషయంలో వారికి అత్యుత్తమ మద్దతు లభిస్తున్నట్టు నాకు అర్థమయింది" అని డాక్టర్ మాండవీయ చెప్పారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నుంచి తనకు అద్భుతమైన మద్దతు లభిస్తోందని, ప్రత్యేకించి ప్రపంచ ప్రఖ్యాత క్రీడా శాస్త్రవేత్త, అమెరికాలోని సెయింట్ లూయిస్ కి చెందిన డాక్టర్ ఆరాన్ హోర్షింగ్ సేవలు అందుకోగలిగానని మీరాబాయి చాను చెప్పారు. యూరప్ బేస్ ల నుంచి తనకు విస్తృత సమయం శిక్షణ లభించిందని అనూరాణి తెలిపారు.

స్థానిక నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో నమోదైన ఇతర అథ్లెట్లు, ప్రముఖ కోచ్ లతో కూడా డాక్టర్ మాండవీయ సంభాషించారు. పోటీతో కూడిన క్రీడల నుంచి డ్రాపౌట్లను తగ్గించేందుకు సలహాలు ఇవ్వాలని ఆయన వారిని కోరారు. "మీరు అవసరమైన మద్దతు పొందుతున్నారు. కాని మీతో పాటుగానే కెరీర్ ప్రారంభించిన పలువురు ఎలాంటి పతకాలు గెలుచుకోకుండా వెనుకబడిపోయి ఉన్నారు. వారి కోసం మనం ఏం చేయాలి" అని ఆయన ప్రశ్నించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ క్రీడారంగం సర్వతోముఖాభివృద్ధి విజన్ కు అనుగుణంగా ప్రభుత్వం అట్టడుగు స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తుందని ఆయన చెప్పారు.

కేంద్ర మంత్రి ఎన్ఎస్ఎన్ఐఎస్ సమీక్ష కూడా చేపట్టడంతో పాటు పలు క్రీడా మైదానాలు, క్రీడా వసతులు, కొత్త మౌలిక వసతుల ప్రాజెక్టు ప్రదేశాలను సందర్శించారు. హై పెర్ఫార్మెన్స్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ సైన్స్, కిచెన్, డైనింగ్ ప్రదేశాల నిర్మాణంలో పురోగతి పట్ల ఆయన ఆనందం ప్రకటించారు.

"భారత క్రీడలకు సాంప్రదాయిక కేంద్రం అయిన ఎన్ఐఎస్ నుం సందర్శించడం నాకు ఆనందంగా ఉంది. గ్రామీణ స్థాయిలో మార్పును తీసుకురాగల కోచ్ ల తయారీ కేంద్రం మాత్రమే కాదు, ఇది ఒక అద్భుతమైన శిక్షణా కేంద్రం. ప్రపంచంలోని ఇతర కేంద్రాల్లో శిక్షణ పొందిన అథ్లెట్లు కూడా ఎన్ఐఎస్ ను ప్రపంచంలోని ఉత్తమ శిక్షణ కేంద్రాలతో సరిపోల్చవచ్చునంటున్నారు" అని డాక్టర్ మాండవీయ చెప్పారు.

తదుపరి తావు దేవి లాల్ స్టేడియంలో నేషనల్ ఇంటర్-స్టేట్ అథ్లెట్ చాంపియన్ షిప్స్ లో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన లోగోను ఆవిష్కరించడానికి కేంద్ర మంత్రి పంచకుల వెళ్లారు.

# హిందువులంటే బీజేపీ, ఆరెస్సెస్ మాత్రమే కాదు -రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, జులై 1 : భారతదేశ ఆలోచన, రాజ్యాంగంపై దాడిని అడ్డుకుంటామని తాము రక్షణగా నిలబడతామన్నారు. రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్న వ్యక్తులపై దాడి జరుగుతోందని ఆరోపించారు లోక్ సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ. మోదీ పాలనలో చాలామంది ప్రతిపక్ష నాయకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. విపక్ష నేతలను వేధించడం సరికాదన్నారు.

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాత తీర్మానంపై నేడే లోక్ సభలో ఆయన మాట్లాడుతూ అధికారం కంటే నిజం గొప్పదనే విషయం తెలుసుకోవాలని సూచించారు. తాను ఈడీ నుంచి 55 గంటల విచారణను ఎదుర్కొన్నానని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నందుకు తాను సంతోషంగా ఉన్నానని గర్విస్తున్నానని వ్యాఖ్యానించారు. అధికార వికేంద్రీకరణ, సంపద వికేంద్రీకరణ, పేదలు, దళితులు, మైనార్టీలపై దౌర్జన్యాన్ని ప్రతిఘటించిన వారిని అణచివేశారని మండిపడ్డారు. ప్రధాని మోదీ ఆదేశాలతోనే తనను విచారణ సంస్థలు విచారించాయన్నారు.

అందరూ హిందువులే..

అయోధ్య రామమందిర సమయంలో కార్పోరేట్ పెద్దలకు మాత్రమే ఆహ్వానం అందిందని ఆరోపించారు. తన ఎంపీ పదవిని, ఇంటిని లాక్కున్నారని మండిపడ్డారు. విపక్ష నేతలను సీబీఐ, ఈడీలతో బెదిరిస్తున్నారని విమర్శించారు. హిందువులంటే బీజేపీ, ఆరెస్సెస్ మాత్రమే కాదన్నారు. సభలో ఉన్నవారు బయట ఉన్నవారూ హిందువులేనన్నారు. హిందూ సమాజం అంటే మోదీ ఒక్కరే కాదన్నారు. శివుడి ఎడమ చేతిలో త్రిశూలం ఉంటుందని అంటే హింసకు ప్రతిరూపం కాదన్నారు. హింసకు ప్రతిరూపమే అయితే కుడిచేతిలో ఉండేదన్నారు.

భయం, ద్వేషం, అబద్ధాలను వ్యాప్తి చేయడం హిందుత్వం కాదని మహాత్మాగాంధీ చెప్పారన్నారు. మన పూర్వీకులు అంతా భయాన్ని రూపుమాపడం గురించి మాట్లాడారని కానీ తమను తాము హిందువులుగా చెప్పుకునే వారు హింస, ద్వేషం, అసత్యమే మాట్లాడుతుంటారని మండిపడ్డారు. ప్రతి మతం కూడా ధైర్యాన్ని బోధిస్తుందన్నారు. అయోధ్యలో బీజేపీని ఓడించడం ద్వారా ఆ రాముడు జన్మించిన భూమి దేశానికి మంచి సందేశాన్ని పంపించిందన్నారు.

కొందరికి ఓ సింబల్ అంటే భయమని? అదే అభయహస్తం అని ఎద్దేవా చేశారు. అయోధ్యలో భూములు లాక్కొని విమానాశ్రయం నిర్మించారని విమర్శించారు. అయోధ్య రామాలయం ప్రారంభం సమయంలో అక్కడి బాధితులు దుఃఖంలో ఉండిపోయారన్నారు. ఆలయ పరిసరాలకు కూడా వారిని రానివ్వలేదన్నారు.

మణిపూర్‌కు వెళ్లండి

ప్రధాని మోదీ ఇప్పటి వరకు మణిపూర్‌కు వెళ్లలేదని విమర్శించారు. మణిపూర్ కూడా మన దేశంలో భాగమేనని వ్యాఖ్యానించారు. మణిపూర్ ఒకసారి వెళ్లాలని సూచించారు. అక్కడి పరిస్థితులు పరిశీలించాలన్నారు. మణిపూర్‌కు ప్రధాని వెళ్లలేదు? హోంమంత్రి కూడా వెళ్లలేదన్నారు. అక్కడి ఘటనలు తన కళ్లముందే ఉన్నాయని వ్యాఖ్యానించారు. తాను పారిపోదల్చుకోలేదని పోరాడుతానన్నారు. కాగా, సభలో రాహుల్ గాంధీ గురునానక్ ఫొటోను ప్రదర్శించారు. ఫొటోను ప్రదర్శించడం నిషేధమని స్పీకర్ స్పష్టం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి-జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్.



మహబూబాబాద్ గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రోజున ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ లెనిన్ వత్సల్ టోప్పో, జడ్పీ సీఈవో నర్మదతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ లో (161) దరఖాస్తులు వివిధ సమస్యల పైన వచ్చాయి. అందులో వ్యవసాయ శాఖ, డిఆర్డిఓ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ సంక్షేమ శాఖ నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చాయని, గ్రీవెన్స్ దరఖాస్తులను పరిశీలించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హత మేరకు సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండర్స్ చేయడం జరిగింది. సమస్యల పై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు వీలున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, పరిష్కరించుటకు వీలులేని దరఖాస్తులను సంబంధిత దరఖాస్తు దారునికి వివరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దిబ్రూఘర్ నగరాన్ని ముంచెత్తిన ఆకస్మిక వరదలు, తద్వారా తలెత్తిన పరిస్థితుల గురించి తెలుసుకున్న శ్రీ సోనోవాల్

న్యూఢిల్లీ, జులై 1 :దిబ్రూఘర్ నగరంలోను, దిబ్రూగర్ లోక్ సభ నియోజకవర్గంలోనూ వరదల కారణంగా తలెత్తిన పరిస్థితులను కేంద్ర నౌకాయానశాఖ మంత్రి శ్రీ శర్వానంద సోనోవాల్ సమీక్షించారు. ప్రజలకు అందుతున్న సహాయ చర్యల గురించి తెలుసుకున్నారు. వరదల ప్రభావంతో తలెత్తే నష్టాల్ని వీలైనంతమేరకు తగ్గించడానికి గాను ఏఏ చర్యలు చేపట్టింది అధికారులు కేంద్రమంత్రికి వివరించారు.

కుండపోతగా కురుస్తున్న వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితులనుంచి ప్రజలను కాపాడడానికి, అత్యవస పరిస్థితుల్లో చేపట్టాల్సిన సహాయ చర్యల గురించి తెలుసుకున్న కేంద్ర మంత్రి వరదనష్టాన్ని వీలైంతమేరకు తగ్గించేలా పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బ్రహ్మపుత్రానది ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తుండడంతో తద్వారా దిబ్రూఘర్ నగరంలో ఏర్పడిన వరద పరిస్థితుల గురించి శ్రీ సోనోవాల్ తెలుసుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాలు వరదబారిన పడి జనజీవనం స్తంభించింది. వరద నష్టాలను సాధ్యమైనంత తగ్గించేలా చూడాలని, ఇందుకోసం చేపట్టే చర్యలు ఉన్నత స్థాయిలో వుండాలని, రానున్న రోజుల్లో వర్షాలు పడతాయని వాతావరణ నివేదికలు చెబుతున్న కారణంగా జాగ్రత్తగా వుండాలని అధికారులకు కేంద్ర మంత్రి సూచించారు. అస్సాం మంత్రులు శ్రీ సంజయ్ కిషన్, రంజీత్ కుమార్ దాస్ లతో మాట్లాడి వరద సహాయక చర్యలపై దిశానిర్దేశం చేశారు. తినుసుకియా, దిబ్రూఘర్ జిల్లాల సంరక్షక మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న రంజీత్ కుమార్ దాస్ రేపు రెండు జిల్లాల్లోనుపర్యటించి స్వయంగా వరద సహాయక చర్యలను పర్యవేక్షంచబోతున్నారు.

సమీక్షా సమావేశం తర్వాత మాట్లాడిన శ్రీ సోనోవాల్ వరదల కారణంగా దిబ్రూఘర్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో ఏర్పడిన పరిస్థితులు ఆందోళనకరంగా వున్నాయని అన్నారు. వర్షాలు ఆగకుండా కురుస్తుండడంతో మరిన్ని రోజులపాటు వర్షాలు పడతాయనే హెచ్చరికల నేపథ్యంలో అత్యవసర సహాయ చర్యలు అందుబాటులో వుండేలా చూస్తున్నామని అన్నారు. అవసరమైనవారందరికీ వరద సహాయ చర్యలందిస్తున్నామని చెప్పారు. దిబ్రూఘర్ నగరాన్ని వరద ముంచెత్తిందని అది అందరిలో ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. నగరంలో వరద ప్రభావాన్ని తగ్గించడానికి చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో అత్యవసర చర్చలు చేయడం జరిగిందని కేంద్రమంత్రి తెలిపారు. అత్యవసర సహాయక చర్యలు చేపట్టడంద్వారా వరదలద్వారా తలెత్తే నష్టాలను తగ్గించడానికి అధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నారని ఆయన వివరించారు.

దిబ్రూఘర్ ఎమ్మెల్యే ప్రశాంత ఫుకాన్ తో పాటు దిబ్రూఘర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో శ్రీ శర్వానంద సోనోవాల్ పరిస్థితిని సమీక్షించారు. మేయర్, డిప్యూటీ మేయర్, వార్డ్ కమిషనర్లు, ఇంకా ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా ప్రైడ్ ఇండియా అవార్డ్స్..

-ఉత్తమ సేవలందించిన వైద్యులకు డా.బి.సి.రాయ్ నేషనల్ అవార్డు

-ముఖ్య అతిథులుగా ఫ్యామిలీ కోర్టు జిల్లా జడ్జి అర్చన కుమారి




ఖమ్మం, జులై 1 : ఖమ్మం నగరంలోని టీటీడీసీ భవనం నందు నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా ప్రైడ్ ఇండియా అవార్డ్స్ చైర్మన్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వప్పుల వేణుగోపాల్ ఆద్వర్యంలో ప్రైడ్ ఇండియా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఫ్యామిలీ కోర్టు జిల్లా జడ్జి అర్చన కుమారి, ఎన్ఆర్ఐ ఫౌండేషన్, విశ్వ హిందూ పరిషత్ చైర్మన్ బోనాల రామ కృష్ణ,పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి అర్చన కుమారి మాట్లాడుతూ? జాతీయ వైద్యుల దినోత్సవం డా.బి.సి.రాయ్ పేరు మీద జరపడం, అలాగే ఉత్తమ సేవలందించిన వైద్యులకు ఆయన పేరు మీద నేషనల్ అవార్డు ఇవ్వటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. డాక్టర్ లు దేవుళ్ళతో సమానమని, ఈ గౌరవం ఎప్పటికీ నిలబెట్టుకోవాలని ఆమె తెలిపారు.

అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్, డాక్టర్ కావ్య, డాక్టర్ స్రవంతి గైనకాలజిస్ట్ లను డా.బి.సి.రాయ్ నేషనల్ అవార్డులను అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ, ఆయుష్మాన్ భారత్ ఖమ్మం జిల్లా సి.ఎమ్. ఓ రాజ శేఖర్, డా.గోపి కృష్ణ, శారద కాలేజీ నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

